RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 233 | సంపుటి 4 | బుధవారం | 13-05-2026 | పేజీలు 4 | వెల 3/-

- సామాన్యుల కోసం ఇనుప కటకటాలు
- తెల్లటి ఖాదీ బట్టలు.. స్టీల్ ప్లేటు.. తోటపని
- డిజిటల్ డిటాక్స్ కు కేరాఫ్ అడ్రస్
- సెల్ ఫోన్లు లేని ప్రపంచంలో ఒక రోజు
- చంచల్ గూడలో జైలు మ్యూజియం ప్రారంభం
- నిజాం కాలం నాటి బేడీలు, రికార్డుల ప్రదర్శన
- సమాజంలో నేరాలు తగ్గించడానికి సరికొత్త ప్లాన్
- చట్టాల పట్ల గౌరవం, బాధ్యత పెంపొందించేలా రూపకల్పన : జైలు సూపరింటెండెంట్ శివకుమార్
- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా 'ఫీల్ ది జైల్' ప్రారంభం



2






# 'ఫీల్ ది జైల్'

## చంచల్ గూడ జైలులో ఒకరోజు గడిపే అవకాశం

సాధారణంగా జైలు అంటేనే నేరస్తులు, ఇనుప కటకటాలు, కఠినమైన శిక్షలు గుర్తుకొస్తాయి. ఆ పేరు వింటేనే సామాన్యులు ఆమడ దూరం జరుగుతారు. కానీ, నేటి యాంత్రిక జీవనంలో, స్మార్ట్ ఫోన్ల మత్తులో మునిగిపోయిన మనిషికి తనను తాను సమీక్షించుకునే ఏకాంతాన్ని అందించేలా.. క్రమశిక్షణతో కూడిన జీవితం అంటే ఏమిటో రుచి చూపించేలా చంచల్ గూడ కేంద్ర కారాగారం ఇప్పుడు ఒక 'అనుభవ పాఠశాల'గా రూపాంతరం చెందింది. ఖైదీల దినచర్యను, జైలు వాతావరణాన్ని సామాన్య పౌరులు సైతం స్వయంగా అనుభవించేందుకు తెలంగాణ జైళ్ల శాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా 'ఫీల్ ది జైల్' (Feel the Jail) అనే వినూత్న కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. చారిత్రక చంచల్ గూడ జైలు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జైలు మ్యూజియంను, ఈ ప్రత్యేక పథకాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల మంగళవారం ప్రారంభించారు. నిజాం కాలం నాటి చరిత్రను తెలుసుకోవడమే కాకుండా, ఒక రోజు పాటు ఖైదీగా మారి.. సెల్ ఫోన్లు, గ్యాడ్జెట్లకు దూరంగా, ఖాదీ దుస్తులు ధరించి, జైలు నిబంధనల ప్రకారం గడపాలనుకునే వారికి ఇదొక అరుదైన వేదిక. కేవలం వినోదం కోసమో, సరదా కోసమో కాకుండా.. చట్టాల పట్ల గౌరవం పెంపొందించడం, నేరాల పట్ల అవగాహన కల్పించడం మరియు మనిషిని అంతర్మథనం వైపు నడిపించడమే లక్ష్యంగా జైలు అధికారులు ఈ అద్భుతమైన డిజిటల్ డిటాక్స్ కేంద్రాన్ని తీర్చిదిద్దారు.

—హైదరాబాద్, ప్రభాత గమనం

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

- ఆలయ గోడ కూలి ఆరుగురు భక్తుల మృతి
- మరో 14 మందికి గాయాలు
- మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లాలో ఘటన



2



2

## మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు నరహరి లొంగుబాటు

- మిసిర్ బెస్రా కోసం కొనసాగుతున్న ముమ్మర కూంబింగ్
- తెలంగాణ పోలీసుల ఎదుట భార్యతో కలిసి లొంగిపోయిన నరహరి
- హనుమకొండ జిల్లా సోమిడి గ్రామానికి చెందిన మావోయిస్టు నేత



2

## 717 మద్యం దుకాణాల మూసివేత

- తమిళనాడులో సీఎం విజయ్ సంచలన నిర్ణయం
- విద్యాసంస్థలు, ప్రార్థనా మందిరాల సమీపంలోని వైన్స్ లు, బార్లపై కొరడా

## ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని సహించం

- క్షేత్రస్థాయిలో పర్యటించి కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షించాలి
- ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు తలెత్తితే పూర్తి బాధ్యత కలెక్టర్లదే
- గన్నీ బ్యాగులు, హమాలీలు, రవాణా సదుపాయాలు అందుబాటులో ఉంచాలి
- ఒప్పందం మేరకు వాహనాలు సమకూర్చని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పని చేయాలని సూచించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కొనుగోలు కేంద్రాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గన్ని బ్యాగులు, హమాలీలు, తూకం యంత్రాలు తదితర అవసరమైన సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలని, రవాణాకు అవసరమైన లారీలను అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

3

# హైదరాబాద్‌లో 'ఫీల్ ది జైల్'..

## మొదటి పేజీ తరువాయి

స్మార్ట్ ఫోన్లు, నిత్యం గందరగోళంగా ఉండే జీవనశైలి నుంచి విముక్తి పొంది, క్రమశిక్షణతో కూడిన ఏకాంత జీవితాన్ని అనుభవించాలనుకుంటున్నారా? అయితే హైదరాబాద్‌లోని చంచల్‌గూడ కేంద్ర కారాగారం మీకు ఒక అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తోంది. తెలంగాణ జైళ్ల శాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఫీల్ ది జైల్' పథకాన్ని తాజాగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు.



### ఒక రోజు ఖైదీగా..

ఈ పథకంలో భాగంగా సామాన్య పౌరులు కూడా ఒక రోజంతా జైలులో ఖైదీలా గడపవచ్చు. జైలులోకి ప్రవేశించగానే సందర్శకులకు ఒక జత తెల్లటి ఖాదీ దుస్తులు, స్టీల్ ప్లేట్, మగ్గు, పరుపు, దుప్పటి మరియు సబ్బుతో కూడిన కిట్‌ను అందజేస్తారు. వారి వ్యక్తిగత వస్తువులు, మొబైల్ ఫోన్లను భద్రపరచడానికి ప్రత్యేక లాకర్ సౌకర్యం ఉంటుంది.

### నిక్కచ్చిగా జైలు దినచర్య

ఇక్కడ గడిపే సమయంలో పర్యాటకులు కచ్చితమైన జైలు నిబంధనలు పాటించాల్సి ఉంటుంది:

**తెల్లవారుజామున:** ఉదయం 6 గంటలకు నిద్రలేచి బ్యారక్‌ను శుభ్రం చేసుకోవాలి.

**ఆహారం:** ఉదయం 7:30కు ఉప్మా లేదా పులిహోర వంటి జైలు అల్పాహారం అందిస్తారు. మధ్యాహ్నం మరియు రాత్రి ఖైదీలకు వండే సాధారణ భోజనాన్నే రుచి చూడాలి.

**శ్రమదానం:** ఉదయం 10 గంటల నుంచి అధికారులు సూచించిన విధంగా తోటపని లేదా ఆవరణను శుభ్రం చేసే పనుల్లో పాల్గొనాలి.

**ఏకాంతం:** రాత్రి 9 గంటలకు లైట్లు ఆర్పేసి నిద్రపోవాలి. ఈ సమయంలో ఎటువంటి గ్యాడ్జెట్లు అందుబాటులో ఉండవు.

### చారిత్రక మ్యూజియం విశేషాలు

గతంలో సంగారెడ్డిలో ఉన్న జైలు మ్యూజియంను ఇప్పుడు చంచల్‌గూడకు తరలించారు. ఇందులో నిజాం కాలం నాటి భారీ ఇనుప బేడీలు, ఆయుధాలు మరియు పాత రికార్డులను ప్రదర్శనకు ఉంచారు. వీటితో పాటు ప్రపంచ ప్రసిద్ధ జైళ్ల ఛాయాచిత్రాలను కూడా ఇక్కడ చూడవచ్చు.

### అవగాహన కోసమే ఈ ప్రయత్నం:

ఈ రోజుల్లో మనిషి గ్యాడ్జెట్లకు బానిసయ్యాడు. ఇక్కడ గడిపే సమయం వారికి 'డిజిటల్ డిటాక్స్'లా పనిచేస్తుంది. జైలు జీవితం ఎంత కఠినంగా ఉంటుందో తెలియజేయడం ద్వారా చట్టాల పట్ల గౌరవం పెంచడమే మా ఉద్దేశం" అని జైలు అధికారులు వెల్లడించారు. "చట్టాల పట్ల గౌరవం పెంచడానికి, జైలు వ్యవస్థపై అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించాం. ఇక్కడికి వచ్చేవారు బయటి స్వేచ్ఛను కోల్పోతారు. ఖైదీలు ఎలాంటి పనులు చేస్తారో, సందర్శకులు కూడా అవే పనులు చేయాల్సి ఉంటుంది" అని చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ తెలిపారు. సమాజంలో నేరాలు తగ్గించడానికి మరియు క్రమశిక్షణతో కూడిన జీవితం యొక్క విలువను తెలియజెప్పడానికి ఈ 'ఫీల్ ది జైల్' కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

# అసోం సీఎంగా హిమంత ప్రమాణ స్వీకారం

- ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు
- అసోంలో వరుసగా మూడోసారి కొలువుదీరిన ఎన్ డీఏ ప్రభుత్వం

**ప్రభాత గమనం, గౌహతి :**

అసోంలో వరుసగా మూడోసారి BJP నేతృత్వంలోని NDA ప్రభుత్వం కొలువు దీరింది. సీఎంగా హిమంత బిశ్వ శర్మ రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. గువాహటిలోని ఖానాపారా వెటర్నరీ కళాశాల మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య సీఎంగా హిమంత బిశ్వ శర్మతో ప్రమాణం చేయించారు. ఆ తర్వాత నలుగురు ఎమ్మెల్యేలు చరణ్ బోరో, అజంతా నియోగ్, అతుల్ బోరా, రామేశ్వర్ తెలితో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, సర్బానంద సోనోవాల్, శివరాజ్ సింగ్ చౌహాన్, జ్యోతిరాదిత్య సింధియాలతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా పలువురు కీలక నేతలు పాల్గొన్నారు. సుమారు లక్ష మంది ఎన్డీఏ మద్దతుదారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.








# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలి

- ఆ దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**హన్మకొండ, ప్రభాత గమనం :**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ ) ప్రక్రియను మరింత వేగవంతం చేయడంపై జిల్లా అధికారులు, తహసిల్దార్లతో సమీక్షా సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వారిగా ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి గురించి అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 146 పోలింగ్ కేంద్రాలలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ తక్కువగా ఉందని, దీంతో 3-4 పోలింగ్ కేంద్రాలకు మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి సాధించేలా పర్యవేక్షించేందుకు 46మంది జిల్లా అధికారులను నియమించినట్లు తెలిపారు. బూత్ లెవల్ అధికారులతో ఇంటింటికి తిరుగుతూ 2002 ఓటర్ల జాబితా వివరాలను సేకరించి 2025 ఓటర్ల జాబితాతో అనుసంధానం చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ 70శాతం వరకు పూర్తి చేయాలన్నారు. అధికారులు తమ కార్యాలయ పరిధిలో ఉన్న ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులతో ఎస్ఐఆర్ మ్యాపింగ్ చేయించాలన్నారు. బుధవారం నుండి వారం రోజుల్లోగా ప్రతి పోలింగ్ కేంద్రంలో 70శాతం కంటే పైగా ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. సోమవారం ఎస్ఐఆర్ పురోగతిపై అధికారులతో తిరిగి సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయడంపై అధికారులు పూర్తిస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, జడ్పీ సీఈవో శేషాద్రి, డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, పలు శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.



# పోక్సో కేసు కొట్టివేయండి

- హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్
- నేడు విచారణకు హాజరుకావాలని పోలీసుల నోటీసులు

**హైదరాబాద్, ప్రభాత గమనం:**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు కీలక మలుపులు తిరుగుతోంది. తనపై నమోదైన ఎఫ్.ఐ.ఆర్ (FIR) ను కొట్టివేయాలని కోరుతూ భగీరథ్ మంగళవారం తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను ఈ నెల 14న వెకేషన్ బెంచ్ విచారించనుంది.

### నేడు విచారణకు రావాలని నోటీసులు

మరోవైపు, ఈ కేసు దర్యాప్తులో భాగంగా పేట్‌బషీరాబాద్ పోలీసులు భగీరథ్‌కు నోటీసులు జారీ చేశారు. నేడు (బుధవారం) మధ్యాహ్నం విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. కరీంనగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు, భగీరథ్ అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేశారు.

### కేసులో పెరిగిన సెక్షన్ల తీవ్రత

బాధితురాలి నుంచి సేకరించిన తాజా స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు కేసులో మరిన్ని కఠిన సెక్షన్లను చేర్చారు. గతంలో ఉన్న 74, 75 (BNS), 11 (POCSO) సెక్షన్లతో పాటు, కొత్తగా సెక్షన్ 5(l) r/w 6 POCSO Act ను జోడించారు. డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో ఈ స్టేట్‌మెంట్ ప్రక్రియ పూర్తయింది.

### చట్టాన్ని గౌరవిస్తా :బండి సంజయ్

ఈ పరిణామాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందిస్తూ.. తండ్రిగా తన మనసు బాధపడుతున్నప్పటికీ, చట్టం ముందు ఎవరైనా సమానమేనని వ్యాఖ్యానించారు. తన కుమారుడు తప్పు చేయలేదని చెబుతున్నాడని, కోర్టు నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. అయితే, రాజకీయ కుట్రలతో తన కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్న వారిని వదిలిపెట్టబోనని ఆయన హెచ్చరించారు.

### అసలేం జరిగింది?

17 ఏళ్ల బాలికను వేధిస్తున్నాడన్న ఆరోపణలపై ఈ నెల 8న బాలిక తల్లి పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా భగీరథ్‌పై కేసు నమోదైంది. అదే సమయంలో, సదరు బాలిక మరియు ఆమె తల్లి తనను డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేస్తున్నారంటూ భగీరథ్ కూడా కరీంనగర్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఇరుపక్షాల పైనా కేసులు నమోదై ప్రస్తుతం విచారణలో ఉన్నాయి.

# 717 మద్యం దుకాణాల మూసివేత

- తమిళనాడులో సీఎం విజయ్ సంచలన నిర్ణయం
- విద్యాసంస్థలు, ప్రార్థనా మందిరాల సమీపంలోని వైన్స్ లు, బార్లపై కొరడా

**చెన్నై, ప్రభాత గమనం:**

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ రాష్ట్రంలో మద్యం నియంత్రణ దిశగా ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ప్రజారోగ్యం, విద్యార్థుల భవిష్యత్తు మరియు సామాజిక భద్రతను దృష్టిలో ఉంచుకుని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 717 ప్రభుత్వ టాస్మాక్ (TASMAC) మద్యం దుకాణాలను వెంటనే మూసివేయాలని ఆదేశించారు.

### 500 మీటర్ల నిబంధన అమలు

పాఠశాలలు, కళాశాలలు, ప్రార్థనా మందిరాలు (గుళ్లు, చర్చిలు, మసీదులు) మరియు బస్టాండ్లకు 500 మీటర్ల పరిధిలో ఉన్న మద్యం దుకాణాలను గుర్తించి, వచ్చే రెండు వారాల్లోగా వాటిని పూర్తిగా తొలగించాలని ముఖ్యమంత్రి స్పష్టమైన గడువు విధించారు.

### సర్వేలో తేలిన వాస్తవాలు


ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే విజయ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 4,765 టాస్మాక్ రిటైల్ షాపులపై అధికారులు సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో నిబంధనలు అతిక్రమించిన దుకాణాల వివరాలు ఇలా ఉన్నాయి: ప్రార్థనా మందిరాల వద్ద 276 దుకాణాలు, విద్యాసంస్థల సమీపంలో 186 దుకాణాలు, బస్టాండ్ల వద్ద 255 దుకాణాలు మొత్తంగా 717 దుకాణాలను తక్షణమే మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### హర్షం వ్యక్తం చేస్తున్న మహిళా సంఘాలు

విద్యాసంస్థల సమీపంలో మద్యం విక్రయాల వల్ల విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడుతోందని, బస్టాండ్ల వద్ద మద్యం బాబుల వల్ల మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సామాజిక సంస్థలు, మహిళా సంఘాలు చాలా కాలంగా ఆందోళన చేస్తున్నాయి. తాజాగా సీఎం విజయ్ తీసుకున్న ఈ సాహసోపేత నిర్ణయం పట్ల రాష్ట్రవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

### ఆదాయం కంటే సంక్షేమమే ముఖ్యం

తమిళనాడు ప్రభుత్వానికి టాస్మాక్ దుకాణాల ద్వారా ఏటా వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ, ఆదాయం కంటే ప్రజా సంక్షేమమే ముఖ్యం అని ఈ నిర్ణయంతో ప్రభుత్వం చాటిచెప్పింది. దశలవారీగా రాష్ట్రంలో మద్యం విక్రయాలను తగ్గించే దిశగా ఇది తొలి అడుగు అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో సామాజిక శాంతి మెరుగుపడుతుందని సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.



# మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు నరహరి లొంగుబాటు

- మిసిర్ బెస్రా కోసం కొనసాగుతున్న ముమ్మర కూంబింగ్
- తెలంగాణ పోలీసుల ఎదుట భార్యతో కలిసి లొంగిపోయిన నరహరి
- హనుమకొండ జిల్లా సోమిడి గ్రామానికి చెందిన మావోయిస్టు నేత

**హైదరాబాద్, ప్రభాత గమనం:**

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ సంతోశ్ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఝార్ఖండ్‌లోని సరండా అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు పొలిట్‌బ్యూరో సభ్యుడు మిసిర్ బెస్రా కోసం విస్తృత స్థాయిలో కూంబింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో నరహరి లొంగుబాటు చర్చనీయాంశమైంది. నరహరి స్వస్థలం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడి గ్రామం. ఆయన భార్య ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళగా సమాచారం. 1996 నుంచి అజ్ఞాత జీవితం గడుపుతున్న నరహరి మావోయిస్టు పార్టీ కార్యకలాపాల్లో కీలకంగా వ్యవహరించారు. క్రమంగా పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగిన ఆయన పలు ఆపరేషన్లలో ప్రధాన పాత్ర పోషించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. భద్రతా బలగాలు ప్రస్తుతం అగ్ర మావోయిస్టు నాయకులు ముప్పాళ్ల లక్ష్మణ రావు అలియాస్ గణపతి, పొలిట్‌బ్యూరో సభ్యుడు మిసిర్ బెస్రాల కోసం గాలింపు చర్యలను వేగవంతం చేశాయి. ముఖ్యంగా మిసిర్ బెస్రా ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు అటవీ ప్రాంతాల్లో తీవ్ర స్థాయిలో కూంబింగ్ కొనసాగిస్తున్నాయి. మూడు దశాబ్దాలుగా అజ్ఞాతంలో కొనసాగిన నరహరి లొంగిపోవడం భద్రతా సంస్థలకు కీలక పరిణామంగా భావిస్తున్నారు. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో మావోయిస్టుల కదలికలపై భద్రతా బలగాలు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. ఇదిలా ఉండగా, మావోయిస్టుల బలమైన స్థావరాలుగా అనుమానిస్తున్న ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది విస్తృత తనిఖీలు, గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

- ఆలయ గోడ కూలి ఆరుగురు భక్తుల మృతి
- మరో 14 మందికి గాయాలు
- మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లాలో ఘటన

**ప్రభాత గమనం, సాంగ్లీ:**


మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లాలో పెను విషాదం చోటుచేసుకుంది. భారీ వర్షం ధాటికి ఓ దేవాలయం గోడ కూలి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోగా, మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం సాయంత్రం జాత్ తాలూకాలోని మోతేవాడి గ్రామంలో ఉన్న మార్గుదేవి ఆలయంలో ఈ దుర్ఘటన జరిగింది.

### రేకుల షెడ్డుపై పడిన గోడ:

సాధారణంగా మంగళవారం కావడంతో మార్గుదేవి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాన నుంచి రక్షణ పొందేందుకు సుమారు 20 మందికి పైగా భక్తులు ఆలయ గోడను ఆనుకుని ఉన్న రేకుల షెడ్డు కిందకు వెళ్లారు. అయితే, వర్షం ధాటికి పురాతనమైన ఆ గోడ ఒక్కసారిగా కుప్పకూలి రేకుల షెడ్డుపై పడింది. దీంతో షెడ్డు కింద ఉన్నవారంతా శిథిలాల కింద చిక్కుకుపోయారు.

### సహాయక చర్యలు:

సమాచారం అందుకున్న సాంగ్లీ పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద నుంచి ఆరుగురి మృతదేహాలను వెలికితీశారు. మృతులలో ముగ్గురు స్థానికులు కాగా, మరో ముగ్గురు కర్ణాటకలోని బీజాపూర్ తాలూకాకు చెందిన వారుగా గుర్తించారు. గాయపడిన 14 మందిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. కాగా, ప్రమాదం జరిగిన సమయంలో ఆలయ ప్రాంగణంలో దాదాపు 350 మంది భక్తులు ఉన్నట్లు సమాచారం. అదృష్టవశాత్తూ గోడ కూలిన ప్రాంతంలో తక్కువ మంది ఉండటంతో ప్రాణనష్టం పరిమితమైందని, లేదంటే మృతుల సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండేదని సాంగ్లీ ఎస్పీ తుషార్ దోషి తెలిపారు. ప్రస్తుతం ఘటనాస్థలి వద్ద సహాయక చర్యలు ముగిశాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.



# బేతోలులో వెల్లివిరిసిన మతసామరస్యం..

- హనుమాన్ జయంతి వేళ ఆంజనేయుడిని దర్శించుకున్న ముస్లిం భక్తుడు



**మహబూబాబాద్,మే,12 (ప్రభాత గమనం):**

భక్తికి కులం ఉండదని, దైవచింతనకు మతం అడ్డుకాదని మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామం మరోసారి నిరూపించింది. మంగళవారం దేశవ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్న వేళ, ఇక్కడ చోటుచేసుకున్న ఒక దృశ్యం అందరినీ ఆకట్టుకుంది.ఆరో వార్డు పరిధిలోని బేతోలులో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో షేక్ ఖాదర్ బాబా అనే ముస్లిం భక్తుడు పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సాధారణ భక్తుడిలాగే గ్రామస్తులతో కలిసి క్యూలైన్లో నిలబడి స్వామివారిని దర్శించుకున్న ఆయన, హనుమంతుడికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. "దైవం ఒక్కటే, మార్గాలు వేరైనా లక్ష్యం ఒకటే. గ్రామంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నారు."అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆంజనేయ స్వామి అనుగ్రహంతో గ్రామం పాడిపంటలతో వర్ధిల్లాలని, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. భక్తుల కోరికలన్నీ నెరవేరాలని, ఇలాంటి వేడుకలు గ్రామాల్లో ఐక్యతను పెంచుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుత సమాజంలో మతాల మధ్య విభేదాలు సృష్టించే శక్తులు పెరిగిపోతున్న తరుణంలో, ఖాదర్ బాబా వంటి వారు చూపే ఈ భక్తి, సహోదర భావం ఎంతో ఆదర్శనీయమన్నారు. బేతోలు గ్రామస్తులు కూడా ఆయనను సాదరంగా ఆహ్వానించి, స్వామివారి ప్రసాదాన్ని అందజేయడం గమనార్హం. ఈ సంఘటన గంగా-జమునా తెహజీబ్ (మతసామరస్యం)కు నిలువుటద్దంగా నిలుస్తోందని పేర్కొన్నారు.



# తొర్రూరు స్కానింగ్ సెంటర్లలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

**మహబూబాబాద్ మే12(ప్రభాత గమనం):**

తొర్రూరు పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను జిల్లా వైద్యాధికారి రవి రాథోడ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మల్ హాస్పిటల్, గణేష్ స్కానింగ్ సెంటర్, పద్మావతి హాస్పిటల్ సహా పలు ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిసిపిఎన్డిటి చట్టం - 1994 ప్రకారం స్కానింగ్ సెంటర్ల నిర్వహణకు సంబంధించి గ ర్భస్థ శిశువు లింగాన్ని స్కానింగ్ సమయంలో గానీ, ఆ తర్వాత గానీ వెల్లడించడం చట్టరీత్యా నేరమని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం అని అన్నారు. అన్ని స్కానింగ్ గదులు, వెయిటింగ్ హాళ్లలో "ఇక్కడ లింగ నిర్ధారణ చేయబడదు" అనే బోర్డు తప్పనిసరిగా ప్రదర్శించాలని అన్నారు. శిక్షణ పొందిన, సర్టిఫైడ్ రేడియాలజిస్ట్ లేదా గైనకాలజిస్ట్ మాత్రమే గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ చేయాలని అన్నారు. ప్రతి నెల 5వ తేదీ లోపు ఫారం-ఎఫ్ ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సమర్పించాలని తెలిపారు. అదే రోజు ఆన్లైన్లో అప్‌లోడ్ చేయాలని, బయో-మెడికల్ వేస్ట్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు, ఫైర్ సేఫ్టీ పరికరాలు తప్పనిసరని తెలిపారు. అన్ని ధృవపత్రాలను ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సేవలు, ఫీజుల వివరాలు తెలిపే బోర్డులను ప్రధానంగా ప్రదర్శించాలన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన ఆసుపత్రులపై షోకాజ్ నోటీసులు జారీ చేయడం, లైసెన్సు రద్దు చేయడం, జరిమానా విధించడం వంటి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రవి రాథోడ్ స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ విరాజిత, డాక్టర్ జ్వలిత, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ లోక్యా , మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన గ్రామాల్లో దాహం దాహం..


- మిషన్ భగీరథ నీరు అందక తండాల్లో ప్రజల అవస్థలు
- నత్తనడకన సంపుల నిర్మాణం.. పట్టించుకోని అధికారులు
- పోచారం-బాలాజీతండా బీటీ రోడ్డును వెంటనే పునరుద్ధరించాలని సీపీఎం డిమాండ్

**గార్ల, మే 12 (ప్రభాత గమనం):**

మండలంలోని ఏజెన్సీ గ్రామ పంచాయతీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలపై సిపిఎం నాయకులు మండిపడ్డారు. పినిరెడ్డిగూడెం, శేరిపురం, బాలాజీతండా, పోచారం గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య, రోడ్ల దుస్థితిని తక్షణమే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పినిరెడ్డిగూడెంలో బి. నరేష్ అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం గ్రామ కమిటీ సమావేశంలో శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'మిషన్ భగీరథ' పథకం గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. శేరిపురంలో నిర్మాణంలో ఉన్న నీటి సంపు పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలకు తాగునీరు అందడం లేదన్నారు. పోచారం సంపు నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం విచారకరమని, అధికారులు స్పందించి ప్రభుత్వమే నేరుగా పనులు చేపట్టాలని కోరారు. రోడ్ల పరిస్థితిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన.. పోచారం క్రాస్ రోడ్డు నుంచి బాలాజీతండా వరకు ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారిందన్నారు. అలాగే కొండలమ్మ దేవాలయం వరకు కంకర పోసి వదిలేసిన రోడ్డుకు వెంటనే బీటీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. గ్రామాల్లో వీధిదీపాలు లేక ప్రజలు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు రాత్రివేళల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పంచాయతీ పాలకవర్గం వెంటనే స్పందించి వీధిదీపాలు ఏర్పాటు చేయడంతో పాటు పారిశుధ్య పనులు మెరుగుపరచాలని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల నాయకులు వి.పి. వెంకటేశ్వర్లు, ఎం. నాగమణి, సిహెచ్. ఎల్లయ్య, శాఖ కార్యదర్శి వి. కొండయ్య, మాజీ ఎంపీటీసీ వి. పద్మ, వార్డు సభ్యులు జి. సీతారాం, బి. ఝాన్సీ, వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు జి. వీరభద్రం పాల్గొన్నారు.

# ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని సహించం

- క్షేత్రస్థాయిలో పర్యటించి కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షించాలి
- ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు తలెత్తితే పూర్తి బాధ్యత కలెక్టర్లదే
- గన్నీ బ్యాగులు, హమాలీలు, రవాణా సదుపాయాలు అందుబాటులో ఉంచాలి
- ఒప్పందం మేరకు వాహనాలు సమకూర్చని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




**హైదరాబాద్, మే12, (ప్రభాత గమనం) :**

రాష్ట్రంలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, సీతక్క, ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కొనుగోలు కేంద్రాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గన్ని బ్యాగులు, హమాలీలు, తూకం యంత్రాలు తదితర అవసరమైన సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలని, రవాణాకు అవసరమైన లారీలను అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఒప్పందం మేరకు వాహనాలు సమకూర్చని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. గోదాముల కొరత ఉన్న ప్రాంతాల్లో రైతు బజార్లు, ఫంక్షన్ హాల్స్ తదితర భవనాలను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని సూచించారు. మొక్కజొన్న పంట అధికంగా పండే జిల్లాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. అవసరమైన చోట పోలీస్ శాఖ సహకారంతో కొనుగోలు ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో ఎక్కడైనా సమస్యలు తలెత్తినా పూర్తి బాధ్యత సంబంధిత జిల్లా కలెక్టర్లదేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కొనుగోళ్ల పురోగతిపై ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదికలు పంపించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబాబాద్ జిల్లా ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పాల్గొన్నారు. వీడియో కాల్ కాన్ఫరెన్స్ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం, ఇబ్బందులు తలెత్తకుండా ఇకముందు ప్రతి కొనుగోలు కేంద్రానికి ప్రత్యేక అధికారులను నియమించి తగిన చర్యలు తీసుకోవాలని. గన్ని బ్యాగులు, హమాలీలు, రవాణా వాహనాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపడుతున్నామని, అవసరమైన చోట తాత్కాలిక నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేయాలని. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ధాన్యం, మొక్కజొన్న సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి దాన్యం మొక్కజొన్నల లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా పూర్తిచేయడం కు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డి సి ఓ వెంకటేశ్వర్లు, డీఎస్ఓ రమేష్, డిఎం సివిల్ సప్లై నరసింహారావు, డిఏఓ సరిత, డిఎం మార్కెటింగ్ వెంకటేశ్వర్లు, మెప్మా డీసీఎం విజయ, ఎంవిఐ సాయి చరణ్, మార్క్ఫెడ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.




# వాజేడులో వాలీబాల్ సంబురాలు

- క్రీడలతో చైతన్యం.. పోలీసుల చొరవకు హర్షం
- సీఐ ముత్యం రమేష్, ఎస్సై జక్కుల సతీష్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**


ములుగు జిల్లా వాజేడు మండలంలో పోలీసు శాఖ తీసుకున్న ఓ వినూత్న చొరవ యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. వాజేడు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం ద్వారా క్రీడలతో పాటు సామాజిక సందేశాన్ని కూడా అందించారు. టోర్నమెంట్‌లో మండలంలోని వివిధ గ్రామాల నుంచి దాదాపు 11 జట్లు పాల్గొన్నాయి. యువ క్రీడాకారులు ఉత్సాహంగా ఆడిన ప్రతి మ్యాచ్ ప్రేక్షకులను కట్టిపడేసింది. మైదానంలో కనిపించిన పోటీ స్ఫూర్తి, క్రీడా స్ఫూర్తి అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వెంకటాపురం సీఐ ముత్యం రమేష్, వాజేడు ఎస్ఐ జక్కుల సతీష్ యువతకు దిశానిర్దేశం చేశారు. "యువత కేవలం క్రీడల్లోనే కాదు, విద్యలో, ఉపాధి రంగాల్లోనూ ముందుండాలి. శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరం" అని సీఐ ముత్యం రమేష్ పేర్కొన్నారు. అదే సమయంలో రోడ్డు భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని కోరారు. చెడు అలవాట్లు, మత్తు పదార్థాలు, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని, యువత భవిష్యత్తును నాశనం చేసుకునే పనుల జోలికి పోకూడదని హితవు పలికారు. ఈ కార్యక్రమం కేవలం క్రీడా పోటీగానే కాకుండా, యువతలో సామాజిక బాధ్యత, క్రమశిక్షణ, ఆరోగ్యకర జీవనశైలి పట్ల అవగాహన కల్పించే వేదికగా నిలిచింది. పోలీసు శాఖ ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజానికి చేరువుతూ, యువతకు అండగా నిలవడం అభినందనీయమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# గంధంపల్లి కొత్తపేటలో తీరనున్న ప్రజల దాహార్తి

- సర్పంచ్ ప్రవీణ్ నాయక్ 'భగీరథ' ప్రయత్నం ఫలప్రదం

**గార్ల, మే,12 (ప్రభాత గమనం) :**

గంధంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపేట గ్రామస్తుల దశాబ్దాల కల నెరవేరబోతోంది. గ్రామంలో నెలకొన్న తీవ్ర మంచినీటి ఎద్దడిని రూపుమాపేందుకు స్థానిక సర్పంచ్ శ్రీ భూక్య ప్రవీణ్ నాయక్ చేపట్టిన ప్రత్యేక చొరవ సత్ఫలితాలను ఇచ్చింది. ఆయన స్వయంగా పర్యవేక్షించి, పట్టుదలతో తవ్వించిన మంచినీటి బావిలో గంగమ్మ తల్లి దర్శనమివ్వడంతో గ్రామస్తుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. గ్రామస్తుల నీటి కష్టాలను తీర్చడమే లక్ష్యంగా కొత్తపేట కుంట వద్ద కొత్త బావి తవ్వకాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సర్వమత ప్రార్థనలు ఫలించి, తవ్విన కొద్ది సేపటికే ఊహించని రీతిలో అధిక ఊట (నీటి ధార) పడింది. ఎండలు ముదురుతున్న వేళ, బావిలో సమృద్ధిగా నీరు పడటాన్ని గ్రామస్తులు ఒక శుభ పరిణామంగా భావిస్తున్నారు. మంగళవారం బావి తవ్వకం పనులను సర్పంచ్ ప్రవీణ్ నాయక్ స్వయంగా సందర్శించారు. నీటి ఊటను చూసి ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ.. "గ్రామ ప్రజల త్రాగునీటి కష్టాలను శాశ్వతంగా పరిష్కరించాలనే నా సంకల్పం నెరవేరింది. త్వరలోనే ఈ బావి ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీటిని అందిస్తాం" అని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంట పలువురు ముఖ్య నాయకులు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్ ప్రవీణ్ నాయక్ మరియు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న వేసవిలో నీటి ఇబ్బందులు తప్పుతాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు.



# తాళ్లపూసపల్లిలో బ్రాహ్మణ కుటుంబానికి వేధింపులు

- 'దేవుడి భూమి' పేరుతో భూకబ్జాకు యత్నం?
- గ్రామ పెద్దలమంటూ బెదిరింపులు.. కోర్టు ఆదేశాలూ బేఖాతరు

**కేసముద్రం మే 12,(ప్రభాత గమనం):**

వంద ఏళ్ల క్రితం చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూమి అది. తరతరాలుగా సాగు చేసుకుంటున్న ఆస్తి. కానీ, నేడు కొందరు స్వార్థపరుల కన్ను ఆ భూమిపై పడింది. దానికి "దేవుని భూమి" అని ముద్ర వేసి, ఒక కుటుంబాన్ని సామాజికంగా, మానసికంగా వేధిస్తున్న ఘటన తాళ్లపూసపల్లి గ్రామంలో వెలుగుచూసింది.అదే గ్రామానికి చెందిన ఒక బ్రాహ్మణ కుటుంబానికి చెందిన పూర్వీకులు సుమారు శతాబ్దం క్రితమే అన్ని ఆధారాలతో ఈ భూమిని కొనుగోలు చేశారు. అయితే, ఇటీవల కాలంలో గ్రామంలో పెద్దలమని చెప్పుకునే కొందరు వ్యక్తులు ఆ భూమిపై వివాదాన్ని సృష్టించారు. అది దేవుడికి చెందిన భూమి అని తప్పుడు ప్రచారం చేస్తూ, సదరు కుటుంబ గౌరవానికి భంగం కలిగిస్తున్నారు.తమకు జరుగుతున్న అన్యాయంపై బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారించిన కోర్టు, ప్రాథమిక ఆధారాలను పరిశీలించి బాధితులకు అనుకూలంగా ఇంజంక్షన్ ఆర్డర్ జారీ చేసింది. గత నాలుగేళ్లుగా ఈ కేసు విచారణలో ఉంది. అయితే, ప్రతివాదులు ఉద్దేశపూర్వకంగా కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా కాలయాపన చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "కోర్టుకు రాకుండా కేసును జాప్యం చేస్తున్నందుకు న్యాయమూర్తి వారికి జరిమానా కూడా విధించారు. అయినా వారి తీరు మారలేదు. బయట మమ్మల్ని బెదిరిస్తూ, గ్రామంలో తప్పుడు ప్రచారాలతో వేధిస్తున్నారు," అని బాధితులు వాపోతున్నారు.చట్టంపై నమ్మకంతో పోరాడుతున్న తమకు, అవతలి పక్షం నుండి ప్రాణహాని ఉందని, నిరంతరం భయాందోళనల మధ్య గడుపుతున్నామని ఆ కుటుంబ సభ్యులు విలేకరులకు తెలిపారు. కేవలం భూమిని కాజేయాలనే కుట్రతోనే ఇలాంటి పుకార్లు పుట్టిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.గ్రామాల్లో ధర్మం పేరిట వ్యక్తుల సొంత ఆస్తులను వివాదాల్లోకి నెట్టడం ఒక కొత్త రకమైన వేధింపుగా మారుతోంది. కోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా ఒక కుటుంబాన్ని సామాజికంగా వెలివేసినట్లు ప్రవర్తించడం సభ్య సమాజానికి గొడ్డలిపెట్టు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తల్లాపుసపల్లిలోని ఈ కుటుంబానికి చట్టపరమైన రక్షణ కల్పించడంతో పాటు, నిజానిజాలను వెలికితీసి బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# గార్లలో ముమ్మరంగా 'టీబీ ముక్త్ భారత్' సర్వే

- ఎక్స్ రే శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్
- గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు

**గార్ల, మే 12 (ప్రభాత గమనం) :**

దేశాన్ని క్షయ (టిబి) రహితంగా మార్చాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'టిబి ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా గార్ల మండల కేంద్రంలో కీలక అడుగు పడింది. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ బానోత్ పార్వతి హాతిరామ్ నాయక్, పేషంట్లలో క్షయ వ్యాధి కారక బ్యాక్టీరియాను గుర్తించేలా ఏర్పాటు చేసిన మొబైల్ ఎక్స్ రే యూనిట్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని, గ్రామస్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారికి మరియు అనుమానితులకు అక్కడికక్కడే ఎక్స్‌రే తీసి, రేడియాలజిస్ట్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు శివకుమార్, నవీన్ కుమార్ మాట్లాడుతూ.. దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జయ, పార్వతి, స్వప్న, పంజాల పద్మతో పాటు రేడియాలజిస్ట్ అరుణ్, హెల్త్ సూపర్వైజర్లు వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్ బేగ్ మరియు స్థానిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# గార్ల రైల్వే స్టేషన్‌లో నిలిచిన 'సింగరేణి'

- సాంకేతిక లోపంతో రెండు గంటల పాటు నిలిచిన ప్యాసింజర్
- ప్రయాణికులకు తాగునీటిని అందజేసిన సీఐటీయూ నాయకులు
- రంగంలోకి దిగిన రైల్వే ఉన్నతాధికారులు



**గార్ల, మే 12 (ప్రభాత గమనం) :**

గార్ల రైల్వే స్టేషన్‌లో విద్యుత్ సరఫరాలో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ రైలు గత రెండు గంటలుగా నిలిచిపోయింది. దీంతో రైలులోని వందలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ఎండ తీవ్రతకు తోడు, రైలులో కరెంటు లేక ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రయాణికులను చూసి స్థానిక సామాజిక సంస్థలు స్పందించాయి. గార్ల ఆర్యవైశ్య సంఘం మరియు సీఐటీయూ నాయకులు తక్షణమే రంగంలోకి దిగి ప్రయాణికులకు ఉపశమనం కలిగించారు. స్టేషన్‌లో నిలిచిన ప్రయాణికులకు, చిన్నారులకు మరియు వృద్ధులకు స్వచ్ఛమైన మంచినీటిని పంపిణీ చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.సుమారు రెండు గంటల నుంచి రైలు కదలకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.విద్యుత్ లైన్లలో ఏర్పడిన లోపం కారణంగానే రైలు నిలిచిపోయినట్లు తెలుస్తోంది.రైల్వే ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని, రైలును త్వరగా పంపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. కనీస సమాచారం ఇవ్వడంలో రైల్వే సిబ్బంది విఫలమయ్యారని, కనీసం తాగడానికి నీరు కూడా లేని పరిస్థితుల్లో స్థానిక సంఘాలు చేసిన సాయం మరువలేనిదని ప్రయాణికులు కొనియాడారు.




## వరంగల్ పోలీస్ కమిషనరేట్లో వాహనాల విడిభాగాల వేలం

- 15న కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహణ :సీపీ సన్ ప్రీత్ సింగ్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉపయోగించిన ప్రభుత్వ పోలీసు వాహనాలకు సంబంధించిన పాత విడిభాగాలను ఈ నెల 15వ తేదీ శుక్రవారం రోజున బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించే ఈ వేలంలో రిపేర్ చేయబడిన బ్యాటరీలు, వాడుకలో నుంచి తొలగించిన టైర్లు, పలు రకాల వాహనాల విడిభాగాలు మరియు ఇతర ఉపయోగించదగిన సామగ్రిని అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖలో వినియోగంలో ఉన్న వాహనాలకు సంబంధించిన పాత సామగ్రిని పారదర్శక విధానంలో వేలం వేయడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంపొందించడమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. వాహనాల రిపేర్, మెకానిక్ పనులు, ఆటోమొబైల్ వ్యాపారాలకు సంబంధించిన వ్యక్తులు, స్క్రాప్ డీలర్లు మరియు ఆసక్తి గల పౌరులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు. వేలం కార్యక్రమం శుక్రవారం ఉదయం 10 గంటలకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని మోటర్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ (ఎంటీవో)లో నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు సమయానికి హాజరై అవసరమైన వివరాలు తెలుసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 87126 85158, 9440242895, 9949568320 నంబర్లను సంప్రదించవచ్చని సీపీ తెలిపారు.

## అందనాలపాడు గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నగేష్

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ ఆశీస్సులతో నూతన కమిటీ
- బాధ్యతాయుతంగా పనిచేస్తా: కొమరగిరి నగేష్

**సిరోలు, మే 12 (ప్రభాత గమనం) :**



క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ పార్టీ కీలక అడుగులు వేస్తోంది. మహబూబాబాద్ జిల్లా సిరోలు మండల పరిధిలోని అందనాలపాడు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొమరగిరి నగేష్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వివాదరహితుడు, మృదుస్వభావిగా పేరున్న నగేష్‌కు పార్టీ పగ్గాలు అప్పగించడం పట్ల గ్రామ క్యాడర్‌లో జోష్ కనిపిస్తోంది.ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడపగడపకు చేరవేయడం, కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీని గ్రామస్థాయిలో తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దే బాధ్యతను పార్టీ నగేష్ భుజస్కందాలపై ఉంచింది. నగేష్‌తో పాటు గ్రామ పార్టీ మహిళా అధ్యక్షురాలుగా గోవింద సామ్రాజ్యం ఎన్నికయ్యారు. ఈ ఎంపికలు పార్టీలో నూతన ఉత్తేజాన్ని నింపాయి.గ్రామ ఉపాధ్యక్షుడు: ధారావత్ శ్రీను, కార్యదర్శి: బాలిన శ్రీనివాస్ కార్యవర్గ సభ్యులు: అజ్మీర వీరు, కనకం నాగయ్య, కుంట సురేష్, ధర్మపురి వీరాచారి, ఆంగోత్ వెంకన్న. మహిళా కమిటీ: ఉపాధ్యక్షురాలు పగిళ్ల ఉపేంద్ర, కార్యదర్శి ఆంగోతు గమిలి, సభ్యులు వాంకుడోత్ హంస, దరిపెల్లి భారతమ్మ.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కొమరగిరి నగేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అర్హులకు అందేలా చూస్తానని, పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాము, స్థానిక కాంగ్రెస్ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

## కల్లాల్లోనే కన్నీరు..

- రవాణా లేక ఆగమవుతున్న 'అన్నదాత'!
- ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం: మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ ఆగ్రహం

**గార్ల, మే,12 (ప్రభాత గమనం) :**

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వ చేతకానితనం వల్ల రైతులు కల్లాల్లోనే కన్నీరు మున్నీరవుతున్నారని బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేవలం ధాన్యం కొనుగోలు చేశామని చేతులు దులుపుకుంటే సరిపోదని, వాటిని సకాలంలో మిల్లులకు తరలించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.కనీసం లారీ ట్రాన్స్‌పోర్ట్ కూడా కల్పించలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వం ఉందని రమేష్ విమర్శించారు. రవాణా సౌకర్యం లేకపోవడంతో, కొనుగోలు కేంద్రాల్లో పోగుపడిన బస్తాల వద్ద రైతులు రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ధాన్యం బస్తాలనే పడకలుగా చేసుకుని రైతులు గడుపుతున్న దుస్థితి పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు.అకాల వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయని, ప్రభుత్వం మొద్దునిద్ర పోవడంతో కళ్ల ముందే ధాన్యం తడిసి ముద్దవుతోందని రమేష్ పేర్కొన్నారు. "సర్వస్వం కోల్పోయి రైతు రోడ్డున పడుతుంటే, అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గం. తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం నష్టపరిహారంతో సహా కొనుగోలు చేయాలి."ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండి వైఖరిని వీడాలని, తక్షణమే తగినన్ని లారీలను ఏర్పాటు చేసి ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకోక ముందే పాలకులు కళ్లు తెరవాలని, లేనిపక్షంలో అన్నదాతల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని శీలంశెట్టి రమేష్ హెచ్చరించారు.




## పుష్కరాల కోసం 25 బారికేడ్లు

- అందజేసిన ఎంపీఎల్ కంపెనీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

కాళేశ్వరం పుష్కరాల సందర్భంగా ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు మహాలక్ష్మి ప్రొఫైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో జిల్లా పోలీసులకు 25 బ్యారికేడ్లు అందజేశారు. సుమారు రూ.2 లక్షల విలువైన ఈ బ్యారికేడ్లను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, కి కంపెనీ ప్రతినిధులు అందించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ స్టీల్ పైప్స్ కంపెనీ తమ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా ఈ సహకారం అందించింది. కంపెనీ బ్రాండింగ్ మేనేజర్ కార్తిక్ గౌడ్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు అధికారులకు బ్యారికేడ్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ.. కాళేశ్వరం పుష్కరాల నిర్వహణలో ప్రజల భద్రతకు ఉపయోగపడే విధంగా సహకారం అందించిన కంపెనీకి ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కంపెనీ మేనేజర్ కార్తిక్ గౌడ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, వెల్ఫేర్ ఆర్ఐ సంతోష్ కుమార్, ఎంటిఓ ఆర్ఐ పూర్ణచందర్, కంపెనీ ప్రతినిధులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

**కేసముద్రం, మే12(ప్రభాత గమనం):**

కూతురే కొడుకై తండ్రికి తలకొరివి పెట్టిన సంఘటన ఉప్పరపల్లి గ్రామంలో మంగళవారం నాడు చోటు చేసుకుంది. కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన గద్దల ప్రభాకర్(53) వడదెబ్బతో మంగళవారం మృతి చెందారు. మృతుడికి కొడుకులు లేకపోవడంతో పెద్ద కూతురు శిరీష తలకొరివి పెట్టింది. మృతుడికి భార్య ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. గద్దల ప్రభాకర్ మరణంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.





## భూపాలపల్లి పీఎస్ లో ఎస్పీ తనిఖీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

వార్షిక తనిఖీల్లో భాగంగా భూపాలపల్లి పోలీస్ స్టేషన్ మరియు సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యక్ష అవగాహన పొందడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా "వన మహోత్సవం" కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించారు. అనంతరం స్టేషన్ పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ విధానం, సిబ్బంది విధి నిర్వహణను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.




## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.రవి
- ఐనవోలు, నందనంలోని మక్కలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

**హనుమకొండ( ప్రభాత గమనం ):**

మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎస్. రవి నిర్వాహకులను అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు, నందనంలోని మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యాన్ని, మక్కలను కొనుగోలు చేశారని, కొనుగోలు కేంద్రాల వద్ద ఎంత ధాన్యం, ఎన్ని క్వింటాల మక్కలు ఇంకా కొనుగోలు చేయాల్సి ఉందనే వివరాలను నిర్వాహకులు, అధికారులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యము, మొక్కజొన్న రైతులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. బస్తాల్లో నింపిన ధాన్యాన్ని, మక్కలను పరిశీలించారు. దాన్యం, మక్కల తరలింపు ను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.రవి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం, మక్కలను త్వరగా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు, మక్కలను గోదాములకు తరలించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, స్థానిక తహసిల్దార్ విక్రమ్ కుమార్, ఇతర అధికారులతో పాటు నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.



## నీటి సంపులో పడి బాలిక మృతి..

- మియాపూర్ లో విషాద ఘటన.. వాచ్ మెన్ కుమార్తె మృత్యువాత
- మూతతీసి ఉన్న నీటి సంపులో పడి ప్రాణాలు కోల్పోయిన 13 ఏళ్ల బాలిక
- బాలిక మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు

**ప్రభాత గమనం, హైదరాబాద్:**

హైదరాబాద్ నగరంలోని మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోకుల్ ఫ్లాట్స్‌లో సోమవారం రాత్రి విషాద ఘటన చోటుచేసుకుంది. అపార్ట్మెంట్‌లో వాచ్మెన్గా పని చేస్తున్న వ్యక్తి కుమార్తె ప్రమాదవశాత్తూ నీటి సంపులో పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం మద్దిరాల తండాకు చెందిన చరణ్, రేణుక దంపతులు గత పది సంవత్సరాలుగా మియాపూర్ ప్రాంతంలో వాచ్మెన్లుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల ఎనిమిది రోజుల క్రితమే చరణ్ శ్రీరెసిడెన్సీ అపార్ట్మెంట్‌లో వాచ్‌మెన్ గా చేరాడు. సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో వారి 13 ఏళ్ల కుమార్తె సారా అపార్ట్మెంట్ ఆవరణలో మూతతీసి ఉన్న నీటి సంపులో ప్రమాదవశాత్తూ పడిపోయినట్లు తెలుస్తోంది. కుమార్తె కనిపించకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. అనంతరం అనుమానం వచ్చి నీటి సంపులో చూడగా బాలిక అచేతన స్థితిలో కనిపించింది.వెంటనే బాలికను బయటకు తీసి నిజాంపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అయితే తమ కుమార్తె మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. ఈ ఘటన ప్రమాదవశాత్తూ జరిగిందా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374